సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 22 । జూలై । 2023



ఏటా వరద.. అదే వ్యథ!

భద్రాద్రిలో గోదావరికి ఏటా వరద ముప్పు ఎదురవుతున్నా శాశ్వత పునరావాస కేంద్రాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించడం లేదు. 10లో



అధికారులు సూచించాకే ఇళ్లకు..

పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులు అధికారులు సూచించిన తర్వాత ఇళ్లకు వెళ్లాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశంలో దట్టమైన మేఘాలు అలుముకుంటాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాద్రిలో శ్రీ సీతారామ చంద్ర స్వామివారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. బేడా మండపంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ రూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. కాగా, ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ కాంట్రాక్టు కాలనీకి చెందిన టి.రిషి సింగ్ రూ.5,116 విరాళం అందజేశారు.

ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి బస

బూర్గంపాడు: గోదావరి వరదలతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బసచేశారు. ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన ఆయనను కలెక్టర్ ప్రియాంక అలా మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో కలసి ఆయన వరదలపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై చర్చించారు. వరదల నేపథ్యంలో ప్రజలకు సేవలను అందించేందుకు వచ్చిన ఐఏఎస్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, గౌతమ్ పొట్రు, కృష్ణ ఆదిత్య, ప్రతీక్‌జైన్‌లతో వరద సహాయక చర్యలపై సమాలోచనలు చేసి తగు సూచనలు చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్కడ?

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీలో గోదావరి వరద పెరుగుతున్నా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కానరావడంలేదు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సైతం పలు సలహాలు, సూచనలను అందచేశారు. భద్రాచలం పొదెం వీరయ్య హైదరాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలియగా, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని మెసేజ్ పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇటువంటి కీలక సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యే గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పోలీసులు అందుబాటులో ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

భద్రాచలంఅర్బన్/చర్ల: గోదావరి వరద ముంపు ప్రాంతాల ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండాలని మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గోదావరి నది వరద ముంపు ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గోదావరి బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించి వరద పరిస్థితులపై ఆరా తీశారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీస్ స్టేషన్ల నూతన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ ముంపు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ సాయి మనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ , పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు వెంకటేష్, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

వరద కాదు.. బురద



గురువారం రామాలయం చుట్టూ చేరిన మురుగు, వర్షపునీరు

- లోపభూయిష్టంగా భద్రాచలం డ్రెయినేజీ వ్యవస్థ
- గోదావరి వరదతో వెనక్కి వస్తున్న మురుగునీరు
- ఏటా నీట మునుగుతున్న ఆలయ పరిసరాలు
- తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్న అధికారులు
- సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పట్టణంలో వెలువడే మురుగునీరు పవిత్రమైన భద్రాచల క్షేత్రం, పావన గోదావరి నడుమ చేరి ఇటు భక్తులు, అటు స్థానికులకు ఇబ్బందులు కలుగజేస్తోంది. ఇరవై ఏళ్లుగా ఇదే సమస్య ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పట్టి పీడిస్తున్నా తాత్కాలిక ఉపశమన చర్యలు మినహా శాశ్వత పరిష్కారం చూపించడం లేదు.

80 అడుగుల ఎత్తుతో 7 కి.మీ. కరకట్ట

గోదావరికి వరదలు వచ్చాయంటే చాలు రాష్ట్ర ప్రజల చూపు భద్రాచలం వైపు మళ్లుతుంది. సీతాసమేత శ్రీరాముడు ఎత్తైన భద్రుడి కొండ మీద కొలువై ఉండగా, కొండకు, గోదావరి నదికి మధ్య 80 అడుగుల ఎత్తుతో ఏడు కిలోమీటర్ల పొడవునా కరకట్ట ఉంది. దీంతో వరద నీరు ఆలయాన్ని ముంచెత్తాలంటే గోదావరి నీటిమట్టం 80 అడుగులకు పైగా రావాలి. చరిత్రలో ఇంతవరకు అంతటి వరద వచ్చిన దాఖలాలు లేవు. కానీ గోదావరి వరద అనగానే ఆలయం చుట్టూ నీరు చేరుతోంది. సమీపంలోని విస్తా కాంప్లెక్స్, అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్సునీటి మడుగులో తేలుతూ కనిపిస్తాయి. పట్టణంలో నిత్యం వెలువడే మురుగునీరు, వర్షపు జల్లులతో వచ్చే బురద నీరు చేరి ఇలా కనపిస్తుంది. దీంతో గోదావరి వరదల్లో భద్రాచల క్షేత్రం చిక్కుపోయిందనే భావన కలుగుతుంది.

35 అడుగులకు చేరితే గేట్లు మూత

గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించేందుకు ఇరవై ఏళ్ల కిందట కరకట్ట నిర్మించారు. పట్టణంలోని మురుగు నీరు గోదావరిలో కలిసేలా మొత్తం ఆరు చోట్ల స్లూయిస్ గేట్లు బిగించారు. వీటి సగటు ఎత్తు 38 అడుగులుగా ఉంది. సాధారణ రోజుల్లో ఎటువంటి ఆటంకం లేకుండా పట్టణంలోని మురుగు నీరు గోదావరిలో కలిసిపోతుంది. కానీ గోదావరిలో వరద నీటి మట్టం 38 అడుగులకు మించితే పరిస్థితులు తారుమారు అవుతాయి. మురుగు నీరు గోదావరిలో కలవడం మాట అటుంచి, గోదావరి వరద నీరే స్లూయిస్‌ల ద్వారా పట్టణంలోకి వస్తుంది. అందుకే వరద నీటిమట్టం 35 అడుగులకు చేరుకోగానే మురుగునీరు వెళ్లే స్లూయిస్ గేట్లను మూసేస్తారు. దీంతో పట్టణంలో పడిన వర్షం కారణంగా వచ్చిన వరద, పట్టణ ప్రజలు ఉపయోగించిన నీరు గోదావరిలో కలిసే వీలుండదు. ఫలితంగా ఆ నీరంతా తిరిగి పట్టణంలోకి వెనక్కి వస్తోంది. దీని వల్ల కనీసం 43 అడుగుల మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద చేరుకోకముందే కొత్త కాలనీ, ఆలయం ముందు ఉన్న పరిసర ప్రాంతాల్లో నీరు చేరుకుంటోంది.

వీడని నిర్లక్ష్యం

గోదావరికి వరద మొదలయ్యే వరకు స్లూయిస్‌ల మెయింటెనెన్స్‌ను పట్టించుకున్న పాపన పోవడం లేదు. ఈ ఏడాది కూడా వరద మొదలయ్యాక స్లూయిస్‌కి సంబంధించి షట్టర్ల పనులు చేపడుతున్నారు. గోదావరికి వరద వచ్చి ఓ వైపు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కరకట్ట మీద పర్యవేక్షిస్తుంటే, మరోవైపు కరకట్ట దిగువన తాపీగా స్లూయిస్ గేట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ నిర్లక్ష్యం కారణంగా విస్తా కాంప్లెక్స్, కొత్తకాలనీ ఇప్పటికే ఓసారి మునకబారిన పడ్డాయి.

మురుగును శుద్ధి చేస్తే మేలు..

పట్టణంలోని మురుగునీరు, వరద నీరు ఆలయ పరిసర ప్రాంతాల్లోకి రాకుండా ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవ్యస్థను నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. దీంతో పాటు మురుగునీటిని మోటార్ల సాయంతో ఎత్తిపోసే బదులుగా భద్రాద్రి క్షేత్రానికి ఉన్న ప్రాముఖ్యతను, ఆలయ పవిత్రతను దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది. మురుగునీటిని శుద్ధి చేయడం ద్వారా స్నానఘట్టాల దగ్గర మురుగునీరు పారకుండా కూడా ఉంటుంది. ప్రస్తుతం స్నాన ఘట్టాలకు ఎగువన వంద మీటర్ల లోపే స్లూయిస్ ద్వారా మురుగునీరు గోదావరిలో కలుస్తోంది. ఇప్పటికే ఐటీసీ సహకారంతో భద్రాచలం ఆలయం లోపల పర్యావరణహితంగా మారింది. అదే తీరుగా ఆలయం చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు, ఆ తర్వాత భద్రాచల పట్టణం మొత్తాన్ని పర్యావరణహితంగా మార్చాలని కోరుతున్నారు.

బ్రాండ్ బర్‌బాద్

కొద్దిపాటి వరద వచ్చినా భద్రాచలం మునిగిపోతోందని, ఆలయం చుట్టూ నీరు చేరుతోందంటూ విపరీతంగా వార్తలు వస్తున్నాయి. వీటి కారణంగా వానాకాలంలో భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గిపోతోంది. తద్వారా భక్తుల రాకపోకల మీద ఆధారపడిన వ్యాపారాలు కుంటుపడుతున్నాయి. మరోవైపు ఆలయం చుట్టూ చేరుతున్న మురుగునీరు, దాన్ని ఎత్తి పోస్తున్న వైనం, ఆ తర్వాత చల్లుతున్న బ్లీచింగ్... అక్కడ వెలువడుతున్న దుర్వాసన అంతా కలిసి భద్రాచలం ఇమేజ్‌కు నష్టం కలిగిస్తున్నాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో వెల్లివిరియాల్సిన ఆధ్యాత్మిక భావనలు భక్తులకు దూరమవుతున్నాయి. వరద సందర్భంగా చేపట్టే పునరావాస కార్యక్రమాలకు తోడు ఈ మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

తాత్కాలిక చర్యలతోనే సరి..

ఆలయం చుట్టూ చేరిన మురుగు, వరద నీటి సమస్యలకు ఇరవై ఏళ్లుగా తాత్కాలిక పరిష్కార మార్గాలనే ఎంచుకుంటున్నారు. అదేమంటే? వరద వచ్చినప్పుడు ఆలయం చుట్టూ, పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన బురద నీటిని మోటార్ల సాయంతో ఎత్తిపోయడం. పదేళ్ల కిందట 20 హెచ్‌పీ మోటర్లతో మొదలైన ఈ ప్రయత్నం, ఇప్పుడు 50 హెచ్‌పీ కెపాసిటీకి చేరుకుంది. ఒకప్పుడు ఇరిగేషన్ శాఖకు చెందిన మోటార్లతో సమస్య తీరిపోయేది. కానీ ఇప్పుడు ఇరిగేషన్‌కు తోడు, సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ సంస్థలకు చెందిన మోటార్లను కూడా వినియోగించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఏడాదికేడాది సమస్య తీవ్రత పెరుగుతున్నా.. శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రయత్నాలు జరగడం లేదు.



బురద నీరు తొలగించాక ఆలయ పరిసరాల్లో చల్లిన బ్లీచింగ్

గోదావరి నీటిమట్టం ఇలా..

భద్రాచలం: భద్రాచలం వద్ద గురు, శుక్రవారాల్లో గోదావరి నీటి మట్టం వివరాలు ఇలా ఉన్నాయి.

గురువారం	సాయంత్రం 6గంటలకు	43.60 అడుగులు
	రాత్రి 12గంటలకు	44.30
శుక్రవారం	ఉదయం 6గంటలకు	43.90
	మధ్యాహ్నం 1గంటకు	43.30
	రాత్రి 7 గంటలకు	41.04
	రాత్రి 11గంటలకు	40.04

అలసత్వం వద్దు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, హాజరైన అధికారులు

- గోదావరి వరదల సీజన్ వరకూ అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాలవారిని పునరావాస కేంద్రాలకు తరలించాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

భద్రాచలం: గోదావరి వరదలు తగ్గే వరకు జిల్లా అధికారులు, సిబ్బంది అలసత్వం వహించొద్దని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. గోదావరి వరదల నేపథ్యంలో మంత్రి శుక్రవారం భద్రాచలం బ్రిడ్జి, కరకట్టల వద్ద వరద పరిస్థితులను పరిశీలించారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరద ముంపు ప్రాంతాల బాధితులను తక్షణమే గుర్తించి ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. వరద ఉధృతిని బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తీసుకెళ్లాలని చెప్పారు. వాగులు, వంకలు కూడా పొంగిపొర్లుతున్నాయని, ప్రజలు రాకపోకలు చేయకుండా నియంత్రణ చేయాలని చెప్పారు. లోతట్టు రహదారుల వద్ద బారికేడ్లు, ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రెండు నెలలు ఇదే పరిస్థితిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరదల సమయంలో ప్రజలు లోతుకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ సేవలు వినియోగించుకోవాలి

అత్యవసర సేవలకు ఎన్డీఆర్ఎఫ్ సేవలను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలోని పరిశ్రమల ఆధ్వర్యంలో ఉన్న రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం అన్ని ప్రాజెక్టులు నిండి ఉంటాయని, ఎక్కడ ఏ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేసినా గోదావరిలోకే వచ్చి చేరుతుందని, ఈ నేపథ్యంలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి

వరద ఉన్నా, తగ్గినా ముమ్మరంగాపారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 70 అడుగులు వరకు వరద వచ్చినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. తాగునీటి పరీక్షలు చేయాలని మిషన్ భగీరథ ఈఈలను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో హెలికాప్టర్ ద్వారా సేవలు అందించేందుకు మూడు హెలిప్యాడ్‌లు సిద్ధం చేయాలన్నారు. వరద ముంపు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ఇక్కడే బసచేస్తానని, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తానని, కేటాయించిన విధుల్లో అధికారులు నిమగ్నం కావాలని చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, వరదల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు కృష్ణ ఆదిత్య, గౌతం పొట్రు, కలెక్టర్ ప్రియాంక, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీ, పరితోష్ పంకజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిజ్‌లను పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ, అధికారులు

మంత్రి పువ్వాడకు సీఎం ఫోన్

సమీక్ష సమావేశం జరుగుతుండగానే మంత్రి అజయ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ ఫోన్ చేసి వరద పరిస్థితిపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని, అర్ధరాత్రి సైతం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాగా చేపడుతున్న సహాయక చర్యలను సీఎంకు మంత్రి పువ్వాడ వివరించారు. వరద ప్రవాహం తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ ఎటువంటి ఇబ్బందులు లేవని, జిల్లా యంత్రాంగం అప్రమత్తం ఉందని, పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

పువ్వాడకు స్వాగతం పలికిన కలెక్టర్, పీఓ

భద్రాచలం వరదల సమీక్ష సమావేశానికి విచ్చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను తొలుత కలెక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌లు ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలిశారు. పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం భద్రాచలం వచ్చిన మంత్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి వరద తగ్గి ఏజెన్సీ ప్రజలు చల్లగా, సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తే వణుకే..

- గోదావరి ఉధృతితో ఏజెన్సీ రైతుల్లో కలవరం
- ముంపు భయంతో పంటల సాగుకు వెనుకంజ



భద్రాచలం అర్బన్: భద్రగిరి క్షేత్రం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది

బూర్గంపాడు: జూలై, ఆగస్టు నెలలు వచ్చాయంటే రెండు నెలలపాటు ఏజెన్సీ వాసులకు వరద భయం పట్టుకుంటుంది. ఈ సారి భయాందోళన మరింత ఎక్కువైంది. గతేడాది గోదావరి వరద 73 అడుగులకు చేరింది. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏటా జూన్ నుంచే పంటల సాగుకు ఉపక్రమించే రైతులు వరద భయంతో ఈఏడాది ఇప్పటివరకు పంటల సాగుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 44 అడుగులు దాటింది. లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు నీటమునిగాయి. భద్రాచలం డివిజన్‌లో గతేడాది గోదావరి వరదలకు సుమారు 34వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. గ్రామాల్లోకి వరద నీరు చేరటంతో వందలాదిమంది ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గతేడాది అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వరదలంటేనే వెన్నులో వణుకు పుడుతోంది.

ఎకరానికి రూ. 15 వేల నష్టం..

భద్రాచలం డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు గ్రామాలు ఏటా గోదావరి వరద ముంపునకు గురవుతున్నాయి. వరదల వల్ల ఎకరాకు కనీసం రూ.15వేలకు పైగా నష్టం వాటిల్లుతోంది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందటం లేదు. తిరిగి పంటల సాగుకు ప్రభుత్వం విత్తనాలను కూడా అందించటం లేదు. ప్రభుత్వ సాయమందక, పెట్టుబడికి డబ్బులు లేక రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వరద భయంతో ముంపు ప్రాంతాల్లో ఇంకా వరినార్లు పోసుకోలేదు. పత్తి, అపరాల పంటల సాగు ప్రారంభించలేదు. పనుల్లేక వ్యవసాయ కూలీలు పట్టణాలకు పోవాల్సి వస్తోంది.

ఆగస్టులో వరినారు..

యాసంగిలో అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో పంటల సాగును ముందుకు జరపాలని ప్రభుత్వం వ్యవసాయశాఖను ఆదేశించింది. జూన్‌లో నార్లుపోసి జూలైలో నాట్లు వేసుకుంటే యాసంగి సాగు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. భద్రాచలం డివిజన్‌లో మాత్రం వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గోదావరి వరదలతో పంటల సాగు ఆలస్యమవుతోంది. ఆగస్టులో నార్లు పోసి సెప్టెంబర్‌లో నాట్లు వేసుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో యాసంగి పంట మే నెలలో కోతకు వస్తుంది. అప్పుడు అకాల వర్షాలు రైతులను వణికిస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో గోదావరి వరదలు, యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు ఇక్కడి రైతులను కలవరపెడుతున్నాయి. దీంతో కొందరు రైతులు పంటల సాగుకు స్వస్తి పలుకుతున్నారు.

వరినార్లు పోయలేదు

గతేడాది గోదావరి వరదలకు 15 ఎకరాల్లో వరిపంట పూర్తిగా నష్టపోయాను. ఆ భయంతో ఈ ఏడాది ఇప్పటివరకు వరినారు పోసుకోలేదు. ఇప్పుడు గోదావరి వస్తోంది. ఆగస్టులో కూడా వరదలు వస్తాయి. ఆ తర్వాత పంటలు వేద్దామనుకుంటున్నాం. యాసంగి పంట వేసేందుకు సమయం సరిపోదు.

–కొండయ్య , రైతు, బూర్గంపాడు

పంట నష్టపరిహారం ఇవ్వాలి

గోదావరి వరదలకు పంటలు నష్టపోతే ప్రభుత్వం ఆర్థికసాయం అందించడంలేదు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారమందిస్తే పంటల సాగుకు ముందుకు వస్తారు. ఇప్పుడు వరదలు, యాసంగిలో అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.

–దారం వెంకట్రామిరెడ్డి, రైతు, రెడ్డిపాలెం

క్లుప్తంగా

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మొండికుంట పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

అశ్వాపురం: గోదావరి వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని జెడ్పీసీఈఓ విద్యాలత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో కేవీఆర్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్, యూడీసీ పద్మావతి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖదీర్, స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువన కురిసిన వర్షానికి 1,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం శుక్రవారం నాటికి 402 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తివేసి 2 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేశ్ తెలిపారు. రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య లోలెవెల్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎగువన ఉన్న గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

ముంపు గ్రామాల నుంచి గర్భిణుల తరలింపు



గుండాల: జల్లేరు నది మీదుగా గర్భిణిని తరలిస్తున్న సిబ్బంది

భద్రాచలంఅర్బన్: గోదావరి వరదలతో ప్రభుత్వ అధికారులు అప్రమత్తమయ్యారు. ముంపు గ్రామాల్లో ఉన్న గర్భిణులను గుర్తించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముంపు ప్రాంతాలైన పర్ణశాల, ఎస్‌ఎన్ పురం, దుమ్ముగూడెం, భద్రాచలం, నెల్లిపాక, బూర్గంపాడు మండలాలకు చెందిన గర్భిణులను గుర్తించిన అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం వరకు దాదాపు 29 మంది గర్భిణులను గుర్తించామని అధికారులు తెలిపారు.

గుండాలలో..

గుండాల: ఆళ్లపల్లి మండలంలో జల్లేరు నది నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో ముందస్తుగా గర్భిణులను పీహెచ్‌సీలకు తరలించారు. మర్కోడు ప్రాంతంలో పలుగ్రామాలకు వరద వచ్చే అవకాశాలున్నాయి. ఈ తరుణంలో ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రేవంత్ గర్భిణులను ముందస్తుగా 108 ద్వారా శుక్రవారం పీహెచ్‌సీకి చేర్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమేశ్, అసిస్టెంట్ నరేశ్, ఆశ వర్కర్ రాంబాయి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్పత్రిలో అగ్నిప్రమాదం



ఆస్పత్రి నుంచి పొగ వస్తున్న దృశ్యం

ఇల్లెందు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం సాయంత్రం వైద్యశాలలోని ఐసీటీసీ సెంటర్, ఎన్‌టీఈపీ సెంటర్లలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బోర్డు నుంచి ఫ్రిజ్‌లకు మంటలు వ్యాపించడంతో మందులు, రిజిస్టర్లు, ఫ్రిజ్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. సిబ్బంది ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. రెండు గదులు, అందులోని మందులు, ఫర్నిచర్, ఫ్రిజ్‌లు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. మంటలు రావడంతో పక్కనే ఉన్న వార్డులోని రోగులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న డీసీహెచ్‌ఎస్ రవిబాబు వైద్యశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాడుకలో ఉన్న పాత ఫ్రిజ్ నుంచి షార్ట్ సర్క్యూట్ అయిందని, మందులు, ఫర్నిచర్, కంప్యూటర్లు, న్యూట్రీషియన్ కిట్లు కాలిపోవడంతో రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. కాగా, తహసీల్దార్ కృష్ణవేణి, కమిషనర్ అంకుషావలి తదితరులు కూడా ఆస్పత్రిని పరిశీలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

విధుల్లో చేరకుంటే తొలగిస్తాం

- పంచాయతీ కార్మికులకు అధికారుల హుకుం
- విధుల్లో చేరాలా.. వద్దా.. అనే సంశయంలో కార్మికులు
- సమ్మె వీడబోమని స్పష్టం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు



ఉన్నతాధికారుల ఆదేశంతో సమావేశమైన మల్టీపర్పస్ వర్కర్లు

ఇల్లెందురూరల్/చుంచుపల్లి: గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు తాము చేస్తున్న నిరవధిక సమ్మెను విరమింపచేసేందుకు ఉన్నతాధికారులు ఏకంగా తొలగింపు అస్త్రాన్ని ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేశారు. తక్షణం విధుల్లోకి చేరకుంటే విధుల నుంచి పూర్తిగా తొలగించి ఇతరులను విధుల్లోకి తీసుకుంటామని స్పష్టం చేస్తూ శుక్రవారం వాట్సాప్ మేసేజ్‌ల ద్వారా కార్మికులకు చేరవేశారు. ఒకవైపు కార్మికులు విధుల్లోకి చేరేలా క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా కార్మికులు మాత్రం మౌనం పాటిస్తూ సమ్మె వీడేదిలేదని స్పష్టం చేస్తున్నారు. అధికారుల హుకుం.. కార్మికుల బెట్టు.. ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న విషయం పల్లెల్లో చర్చనీయాంశంగా మారింది.

16 రోజులుగా కొనసాగుతున్న సమ్మె

జిల్లాలోని 481 గ్రామపంచాయతీల పరిధిలో 1,652 మంది మల్టీపర్పస్ వర్కర్లు విధుల్లో ఉన్నారు. గ్రామపంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన వారిని 2019లో విధుల్లోకి తీసుకొని రూ.8,500 చొప్పున వేతనం చెల్లిస్తూ వచ్చారు. కరోనా సమయంలో కార్మికులు అంకితభావంతో చేపట్టిన పనులకు మెచ్చి వేతనాన్ని మరో రూ.వెయ్యి పెంచుతూ మేడే సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో కార్మికుల వేతనం రూ.9,500లకు చేరుకుంది. కానీ, మినిమం వేజ్ యాక్ట్ ప్రకారం తమకు వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పదోన్నతులు వంటి సౌకర్యాలు కూడా సమకూర్చాలని కోరుతూ జూలై 6వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెకు ముందుగానే కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి కార్మికులకు మద్దతు ప్రకటించాయి. కార్మిక సంఘాల సాయంతో ముందస్తుగా సమ్మె నోటీసు ఇచ్చిన కార్మికులు ప్రభుత్వానికి తమ నిర్ణయాన్ని స్పష్టం చేశాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించక పోవడంతో ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం కార్మికులు సమ్మెబాట పట్టారు. నాటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూ సమ్మెను 16వ రోజుకు చేర్చారు.

ఏం చేయాలన్న ఆలోచనలో..

16 రోజులుగా నిరవధిక సమ్మెలో అంకితభావంతో పాల్గొన్న కార్మికులకు తాజాగా అధికారుల ఆదేశాలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురిచేశాయి. హఠాత్తుగా విధుల నుంచి తొలగిస్తామన్న హుకుం వారిని ఆలోచనలో పడేసింది. విధుల్లో చేరాలా? వద్దా? అన్న సంశయం వారిలో నెలకొంది. సమ్మె వీడితే తమ డిమాండ్లు గాలిలో కలిసిపోతాయన్న ఆందోళన కొందరిలో ఉండగా ఉన్న ఉపాధిని పోగొట్టుకుంటామా? అన్న ప్రశ్నలు మరికొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు రంగంలోకి దిగి కార్మికులకు ధైర్యం నూరిపోయడంతోపాటు సమ్మె వీడేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఉన్నతాధికారులు, కార్మికులు తీసుకునే నిర్ణయంపై కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతుందో.. నిలిచిపోతుందో వేచి చూడాల్సిందే.

చివరి అస్త్రం ప్రయోగించేందుకు సన్నద్ధం

పల్లెల్లో రోజురోజుకూ పారిశుద్ధ్యం అధ్వాన స్థితికి చేరుకోవడం.. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో వర్షాలు అధికంగా కురవడం, భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ప్రమాదస్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రాచలంలో సహాయక చర్యలు చేపట్టేందుకు గతేడాది మాదిరిగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లను వినియోగించుకునే పరిస్థితి ప్రస్తుతం లేకపోవడంతో జిల్లా అధికారులు కార్మికులపై చివరి అస్త్రాన్ని ప్రయోగించేందుకు సన్నద్ధమయ్యారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌ను అనుసరించి ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా మల్టీపర్పస్ వర్కర్లందరూ వెంటనే విధుల్లో చేరాలని లేనిపక్షంలో విధుల నుంచి తొలగించి కొత్తవారికి అవకాశం ఇస్తామని పేర్కొంటూ జిల్లా అధికారులు మండలస్థాయి అధికారుల ద్వారా మల్టీపర్పస్ వర్కర్లకు శుక్రవారం సమాచారం చేరవేశారు. విధుల్లో చేరేందుకు సమ్మతించినా.. లేకున్నా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆ మేరకు లిఖితపూర్వకంగా లేఖ అందజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

విధుల్లోకి చేరేలా పెరిగిన ఒత్తిడి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కార్మికులు విధుల్లో చేరాలని పలు రూపాల్లో ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల సహాయంతో కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేసి విధుల్లోకి చేరాలని విజ్ఞప్తి చేయించింది. లేనిపక్షంలో పల్లెల్లో ప్రజారోగ్య ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయంగా ఇతరులను విధుల్లోకి తీసుకొని పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చేసిన ఈ ప్రయత్నాన్ని కార్మికులు నిరసనల ద్వారా అడ్డుకున్నారు.

చర్చల కోసం కార్మిక సంఘాల జేఏసీకి పిలుపు

గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెతో పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానస్థితికి చేరుకుంది. సమ్మె 16 రోజులుగా కొనసాగుతుండగా ఆందోళన మరింత ఉధృతం కాకముందే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని, భద్రాద్రి జిల్లాలో కార్మికుల తొలగింపునకు కసరత్తు చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, కార్మిక సంఘాల నేత జూలకంటి రంగారెడ్డి, కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ పాలడుగు భాస్కర్ శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి 22వ తేదీ (శనివారం) ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో చర్చలకు రావాలని కార్మిక సంఘాల జేఏసీని ఆహ్వానించారు.

తొలగిస్తామనడం అన్యాయం



వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, పదోన్నతుల అవకాశం కల్పించాలని కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చిన తరువాతే విధులకు దూరంగా ఉన్నాం. 16 రోజులుగా సమ్మె చేస్తున్నాం. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం విధుల నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేయడం అన్యాయం. –జటంగి వెంకన్న, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కోకన్వీనర్

సమ్మె కొనసాగిస్తాం..



ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె వీడేది లేదు. కార్మికులు విధుల్లో చేరేలా పంచాయతీ కార్యదర్శులు ఒత్తిడి తెస్తున్నారు. ఇది సమంజసం కాదు. కార్మికులు ఎవరూ లిఖితపూర్వకంగా ఎలాంటి అంగీకార పత్రాలు ఇవ్వరు.

– తొగర సామేలు, కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్

అధికారులు సూచించాకే ఇళ్లకు..

పునరావాస బాధితులతో కలెక్టర్ ప్రియాంక అలా



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలంటౌన్: గోదావరి ముంపుతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులు ముంపు తగ్గిన వెంటనే ఇళ్లకు వెళ్లొద్దని, అధికారులు సూచించిన తర్వాత వెళ్లాలని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. భద్రాచలం పట్టణంలోని నన్నపనేని మోహన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ఉదయం, రాత్రి సందర్శించి ఆమె సందర్శించి మాట్లాడారు. పునరావాసం పొందుతున్న 25 కుటుంబాలతో మాట్లాడి ఆహారం, తాగునీరు, విద్యుత్, వైద్యం, పరిసరాల పరిశుభ్రత తదితర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని చెప్పారు. ముంపు కాలనీల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేయించిన తర్వాత బాధితులను తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్‌లోకి వచ్చిన వరద నీరును మోటార్లతో తోడుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ రమాకాంత్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, ఆర్డీఓ రత్నకల్యాణి, భద్రాచలం ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

భద్రాచలం పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి నాగమణిని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి తాత్కాలిక కార్మికులను రప్పించాలన్నారు. ఇక్కడి గ్రామపంచాయతీ కార్మికులు అడ్డుపడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అరెస్ట్ చేయించాలని సూచించారు. వర్షాలతో అపరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈవీఎంలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన ప్రదర్శన కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో రెండు వాహనాల ద్వారా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేసి, నమూనా ఓటుహక్కు ద్వారా అవగాహనను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామని పేర్కొఅన్నరు. అనంతరం ఐడీఓసీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఎలక్ట్రానిక్ వాహనం పనితీరును పరిశీలించారు.

విర్రవీగుతున్న వారికి గుణపాఠం చెబుదాం

- మోసపూరిత సీఎంను ఇంటికి పంపడం అందరి బాధ్యత
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి




మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన దుర్గాప్రసాద్ నాయకులు

వైరా: రాష్ట్రంలో దుర్మార్గపు పాలనను అంతం చేయడమే కాక మోసపూరిత మాటలు చెబుతు న్న సీఎంను ఇంటికి పంపించే కార్యక్రమం ఖమ్మం జిల్లా నుండే ప్రారంభమవుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. వైరాలో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పొంగులేటి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం ఉందన్న అహంకారంతో విర్రవీగుతున్న వారికి గుణపాఠం చెప్పాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీ గేటు తాకనివ్వననే మాట తన ఒక్కడిది కాదని, కాంగ్రెస్ శ్రేణులందరిదని గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ అంటేనే ఓ కుటుంబమని, ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా కష్టించాలని పిలుపునిచ్చారు. పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను అడ్డు పెట్టుకుని కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేవరకు శ్రేణులను కాపాడుకుంటామ ని తెలిపారు. తొలుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, నాయకులు బానోత్ విజ యాబాయి, మాలోత్ రాందాస్‌నాయక్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, వడ్డె నారాయణరావు, దాసరి దానియేలు, మిట్టపల్లి నాగి, గుమ్మా రోశయ్య, లేళ్ల వెంకట రెడ్డి, బొడ్డు కృష్ణయ్య, కోసూరి శ్రీనివాసరావు, పంది సైదులు, పణితి సైదులు, రాయల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ దిమ్మెలు ట్రక్కు రూ.2 వేలు

సెంట్రల్ లైటింగ్ పేరుతో ఆర్‌అండ్‌బీ సొత్తు విక్రయం



డివైడర్ శకలాలను తరలిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్ పేరుతో రహదారిపై డివైడర్‌ను తవ్వి శకలాలను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. డివైడర్‌పై పార్కింగ్ టైల్స్‌కు ఒక రేటు.. రిటైనింగ్ కాంక్రీట్‌వాల్‌కు ఓ రేటు.. సిమెంటు పెళ్లలకు ఓరేటు చొప్పున విక్రయిస్తున్నారు. ఇందుకోసం పొరుగు రాష్ట్రం జీలుగుమిల్లి నుంచి ఓ లోడింగ్ ట్రాక్టర్‌ను ఎంగేజ్ చేసిమరీ అమ్మకాలు సాగుతున్నాయి. స్థానికులు వీధుల్లో గుంతలు పూడ్చుకోవాలంటే రూ.2 వేలు చెల్లిస్తే ట్రక్కు శిథిలాలు అమ్ముతున్నారు. ఇక పార్కింగ్ టైల్స్, తొలగించిన సీసీ వాల్స్‌కు అదనపు ధరలు చెల్లించాల్సిందే. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ జేటీఓ శెట్టిపట్టి కృష్ణార్జున్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా వర్షం కురుస్తున్న కారణంగా శిథిలాలు తొలగించలేదని, అక్రమ రవాణా తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కుమారుడిపై అనుచిత వ్యాఖ్యలు!

సుజాతనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే కుమారుడిపై ఓ వ్యక్తి వాట్సాప్‌లో శుక్రవారం అనుచిత వ్యాఖ్యలు చేశాడు. జూలూరుపాడు మండలం లైన్‌తండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితుడి మొబైల్ నుంచి ఎమ్మెల్యే కుమారుడికి వ్యతిరేకంగా వాఖ్యలు పోస్ట్ చేశాడు. ఈ విషయంపై సుజాతనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు వ్యక్తిని పిలిపించి విచారించారు. అతడు తన తప్పును అంగీకరించడంతో విడిచిపెట్టినట్లు తెలిసింది.

కీలక కేసులో సీఐడీ చార్జ్‌షీట్

ఖమ్మంక్రైం: సంచలనం సృష్టించిన కీలక కేసులో ఖమ్మంకు చెందిన వ్యక్తులపై వరంగల్ రీజనల్ సీఐడీ అధికారులు శుక్రవారం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఓ మతానికి సంబంధించి మనోభావాలు దెబ్బతినేలా పుస్తకం ప్రచురించారంటూ 2010లో ఖమ్మంకు చెందిన మచ్చా లక్ష్మయ్య అలియాస్ క్రాంతికార్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. రచయితలు సల్మాన్‌రష్దీ రచించిన సాటానిక్ వర్సెస్, తస్లీమా నస్రీన్ రచించిన లజ్జా పుస్తకాల నుంచి కొన్ని అంశాలను తీసుకుని వీరు పుస్తకాన్ని ప్రచురించారు. అయితే, ఓ మతానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులు అందడంతో అప్పట్లో ఖమ్మం టూటౌన్ పోలీసులు మచ్చా లక్ష్మయ్య అలియాస్ క్రాంతికార్, మారదాని సుబ్బారావు, నారిశెట్టి ఇన్నయ్య, ఉప్పలపాటి గోపాలకృష్ణరాజు, దెగుంట్ల వెంకటేశ్వర్లు, ఈదుప్పగంటి భానుప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న కేసుకు సంబంధించి దర్యాప్తు చేసిన సీఐడీ అధికారులు తాజాగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

గుప్తనిధుల కలకలం



గోపాల్‌రావుపేటలో పూజ చేసిన ఆనవాళ్లు

పినపాక: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శుక్రవారం గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టడం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో మంత్రించిన నిమ్మకాయలతో పూజలు చేసి తవ్వకాలు చేపట్టినట్లు గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఒక కలశం చెంబు ఇతర ఆనవాళ్లు ఉండటంతో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తోందని చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇస్తామని, ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడు దుర్మరణం



రామకృష్ణ మృతదేహం

ములకలపల్లి: వరి నారుమడి సిద్ధం చేసి వస్తున్న తరుణంలో ట్రాక్టర్ బోల్తా పడగా.. డ్రైవింగ్ చేస్తున్న యువకుడు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గుట్టగూడెం గ్రామానికి చెందిన సవలం రామకృష్ణ (32) మూకమామిడి ప్రాజెక్ట్ శివారులోని వరి పొలంలో శుక్రవారం నారుమడి సిద్ధం చేసేందుకు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లాడు. పని ముగించుకొని తిరుగి ఇంటికి వస్తున్న సమయంలో ప్రాజెక్ట్ కాల్వ దాటుతున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. రామకృష్ణ అక్కడికక్కడే ప్రాణాలొది లాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి బాలిక మృతి

దమ్మపేట: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ ఓ బాలిక కిందపడి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని కొత్తపేటకాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం దమ్మపేట గ్రామ పరిధిలోని కొత్తపేటకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి పిల్లలు ఆడుకోవడానికి వెళ్లా రు. ఈ క్రమంలో భవనం మూడో అంతస్తులో ఆడుకుంటున్న దమ్మపేట గ్రామానికి చెందిన తోకల హర్షిత (15) ప్రమాదవశాత్తూ లిఫ్ట్ కోసం ఖాళీగా ఉంచిన స్థలం నుంచి కిందకు పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హర్షితను అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి...



రాము (ఫైల్)

పాల్వంచ: కేటీపీఎస్ కన్జ్యూమర్ స్టోర్‌లో గతంలో మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి పురుగుమందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్ ఐఎంకాలనీలో నివాసం ఉంటున్న తిప్పారపు రాము (45) గతంలో కేటీపీఎస్ స్టోర్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహించాడు. అనంతరం మార్కెట్‌లో ఓ బేకరీ షాపును నిర్వహించి తీసేసి, కొంతకాలంగా ఖాళీగానే ఉంటున్నాడు. మూడేళ్ల కిందట పరిచయమైన మహిళతో సహజీవనం చేస్తుండటంతో భార్యకు తెలిసి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. కాగా, ఈ నెల 19న రాము మద్యం సేవించి తర్వాత పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. ఎస్‌ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికుడు...



రామస్వామి (ఫైల్)

టేకులపల్లి: ఒక కాలు లేకపోవడం, తీవ్ర అనారోగ్యంతో మనస్తాపం చెందిన సింగరేణి మాజీ కార్మికుడు పురుగులమందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. సులానగర్ గ్రామానికి చెందిన గారె రామస్వామి (65) సింగరేణి మాజీ ఉద్యోగి. భార్య విజయకుమారి సులానగర్ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తోంది. కొన్నేళ్ల కిందట షుగర్ వ్యాధి రావడంతో ఒక కాలు తీసేశారు. అప్పటి నుంచి పలు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. తీవ్ర మనస్తాపానికి లోనై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కోడలు ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కేంద్రం నయాపైసా ఇవ్వలేదు..

- మోదీ సర్కారుకి ఎన్నో అంశాల్లో మద్దతు ఇచ్చాం.. కానీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నో అంశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినా విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీనెరవేర్చ లేదని మంత్రి కేటీరామారావు అన్నా రు. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన ప్పటికీ తెలంగాణకు కేంద్రం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభి వృద్ధి కేంద్రంలో శుక్రవారం 'అభయ్ త్రిపాఠీ స్మారక ఉపన్యాసం'లో భాగంగా 'కొత్త రాష్ట్రం.. సవాళ్లు' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లే మొత్తంలో తిరిగి 46% మాత్రమే రాష్ట్రా నికి వస్తోందన్నా రు. ప్రతీ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు.

ఐటీలో బెంగుళూరును అధిగమించాం

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం పురోగతి ద్వారా యువత ఆలోచన ధోరణిలో మార్పు వచ్చిందన్నారు. 30 ఏళ్ల వయసులోపే ఐటీ ఉద్యో గులు సొంత ఇళ్లు కొనుగోలు చేస్తుండటమే దీనికి నిదర్శనంగా కేటీఆర్ పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగుళూరును హైదరాబాద్ రెండేళ్లుగా అధిగమిస్తోందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్య మించి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర, సమీకృత, సమతుల అభివృద్ధిని సాధించామని మంత్రి కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఎదురైన సవాళ్లు, సందేహా లను పటాపంచలు చేసి అందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా పాలన సాగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగా ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమైందని, మిషన్ భగీరథ లాంటి పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని కేటీఆర్ అన్నారు.

ఇదీ వీళ్ల సంస్కారం!

చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసు

- వెంకటగిరి సభలో ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్


తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి : వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న బాధతో, భవిష్యత్‌పై కలత చెందిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వీరంతా సంస్కార హీనులని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఎండైనా, వానైనా, చలైనా, వరదలొచ్చినా, పండగ రోజైనా, సెలవురోజైనా నిక్కచ్చిగా సేవ చేస్తున్న వలంటీర్ల క్యారెక్టర్‌పై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం ఆయన వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కొనివిషయాలు మాట్లాడకూడదనుకున్నా పరిస్థితులు చూసినప్పుడు తప్పడం లేదన్నారు. ఎక్కడైనా మంచి చేస్తున్న వ్యవస్థలను, మనుషుల్ని సంస్కారం ఉన్న ఏ ఒక్కరూ అవమానించరని, కానీ మంచి చేస్తున్న మన వలంటీర్ల గురించి ఇటీవల సంస్కారం కోల్పోయి కొందరు మాట్లాడుతున్నందు వల్ల ఈ మాటలు చెప్పాల్సి వస్తోందని చెప్పారు. వలంటీర్లంతా మన ఊళ్లో, మన కళ్లెదుటే నాలుగేళ్లుగా కనిపిస్తున్నారని, మనందరికీ తెలిసిన వాళ్లేనన్నారు. ఒకటో తేదీ రాగానే సూర్యోదయాని కన్నా ముందే చిక్కటి చిరునవ్వుతో తలుపుతట్టి, గుడ్ మార్నింగ్ చెబుతూ ఇదిగో మీ పెన్షన్ అంటూ అవ్వాతాతలను చిరునవ్వులతో పలకరించే కుటుంబ సభ్యులు మన వలంటీర్లు అని చెప్పారు. అవినీతికి, వివక్షకు తావు లేకుండా, మనందరి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడప వద్దకూ.. కాళ్లకు బలపం కట్టుకుని మరీ వెళ్లి.. కులం, మతం, వర్గం, ప్రాంతం చివరకు వారు ఏ పార్టీ వారు అని కూడా చూడకుండా అవ్వాతాతలకు మేలు చేస్తున్న మనవళ్లు, మనవరాళ్ల వ్యవస్థపై కొందరు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తప్పుడు మాటలకు స్క్రిప్ట్ ఈనాడు రామోజీరావుది అయితే నిర్మాత చంద్రబాబు.. నటన, మాటలు, డైలాగులు అన్నీ దత్తపుత్రుడివి అని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నిస్సిగ్గు రాతలు

- వలంటీర్లు స్త్రీలను లోబర్చుకుంటారని ఒకరంటారు. గ్రామ వలంటీర్లు అమ్మాయిలను హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారు.. ముంబయికో, ఎక్కడికెక్కడికో పంపించేస్తున్నారు అని ఇంకొకరు నిస్సిగ్గుగా అంటారు. దీన్ని తాటికాయంత అక్షరాలతో ఈనాడు పత్రిక, సిగ్గులేని ఆంధ్రజ్యోతి పత్రిక, ఇంకో సిగ్గులేని టీవీ-5 మీడియా రాస్తాయి. ఇటువంటి వారంతా బురద జల్లుతారు. అబద్ధాలకు రెక్కలు తొడుగుతారు.
- 2.60 లక్షల మంది మన పిల్లలు గ్రామ స్థాయిలో సేవలందిస్తున్నారు. ఇందులో 60 శాతం నా చెల్లెమ్మలే. మన వలంటీర్లు అంతా కూడా చదువుకున్న సంస్కారవంతులే. వీరంతా సేవా భావంతో పని చేస్తున్నారు. ఇలాంటి మన సేవామిత్రలు, సేవారత్నాలు, సేవా వజ్రాలు అయిన మన వలంటీర్ల కేరెక్టర్‌ను తప్పుపట్టింది ఎవరో తెలుసా?
- ఒకరు పదేళ్లుగా చంద్రబాబుకు వలంటీర్‌గా పని చేస్తున్న ప్యాకేజీ స్టార్. ఇంకొకరు చంద్రబాబు నాయుడు. మరొకరు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5. వీరంతా ఒక గజదొంగల ముఠా. వీళ్లు వలంటీర్ల క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్నారు. వలంటీర్ పిల్లల కేరెక్టర్ ఎలాంటిదో అదే గ్రామంలో వారి సేవలందుకుంటున్న కోట్ల మందికి తెలుసు.

వీరికి మంచి చేసిన చరిత్రే లేదు

- ఎందుకు ఈ స్థాయికి దిగజారిపోయారంటే వీరికి మంచి చేసిన చరిత్ర లేదు. ఫలానా మంచి చేశాం.. అందుకే మాకు తోడుగా ఉండండి అని చెప్పుకోవడానికి కూడా ఒక్కటంటే ఒక్కటి మంచి చేసిన చరిత్ర లేదు. ఉన్నదంతా వంచన, వెన్నుపోట్లు మాత్రమే. ఇదీ వీళ్ల జీవిత చరిత్ర.

రూ.5 కోట్లు ఇవ్వకుంటే అంతుచూస్తా

- ఓ బిల్డర్‌ను బెదిరించిన ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్
- బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


చంద్రశేఖర్

బంజారాహిల్స్: 'నీపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టిపెట్టారు. నాకు రూ.5 కోట్లిస్తే అధికారులతో మాట్లాడి సెటిల్ చేయిస్తా' అంటూ ఓ బిల్డర్‌ను పలుమార్లు డబ్బు డిమాండ్ చేసిన బాచుపల్లిలోని డీఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ మన్నెం చంద్రశేఖర్ (44)ను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి కథనం ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని లుంబినీ మాల్‌లో ఉన్న శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నంబూరి కల్యాణ చక్రవర్తి (40)కి మన్నెం చంద్రశేఖర్ అనే వ్యక్తి జూన్ నుంచి తరచూ ఫోన్లు చేస్తూ రూ. 5 కోట్ల కోసం డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. అయితే దీన్ని కల్యాణ్ చక్రవర్తి పెద్దగా పట్టించుకోకపోవడంతో డబ్బివ్వ కుంటే చంపేస్తానని బెది రించసాగాడు. గత నెల 6న మరోసారి ఫోన్ చేసి తాను పార్క్ హయత్‌లో ఉన్నానని.. అక్కడికి వచ్చికలవకుంటే చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించాడు. దీంతో కల్యాణ్ చక్రవర్తి హోటల్‌కు వెళ్లి చంద్రశేఖర్‌ను కలవగా మరోసారి డబ్బు కోసం పట్టుబట్టాడు. బాధితుడు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఇప్పటికిప్పుడు రూ. 3 కోట్లు అయినా ఇవ్వకుంటే అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో మన్నెం చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఐపీసీ సెక్షన్ 387, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ రాకెట్‌పై చార్జ్‌షీట్

వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు

అశ్వారావుపేట: అంతర్జాతీయ కిడ్నీ రాకెట్‌కు సంబంధించిన కేసులో వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు శుక్రవారం 'సాక్షి'కి అందాయి. 2016లో భద్రాది కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాయుడుపేటకు చెందిన ముప్పా నరేష్ బెట్టింగ్, ఇతర వ్యసనాలకు లోనయ్యాడు. డబ్బు కోసం కిడ్నీ అమ్మాలని అనుకున్నాడు. ఓ ముఠాను సంప్రదించగా, ఆ ముఠా సభ్యులు పరీక్షలు చేయించగా, అవసరమైన ఓ వ్యక్తికి నరేష్ కిడ్నీ సరిపోయింది. అయితే కిడ్నీ మార్పిడికి ఇక్కడి చట్టాలు అనుమతించలేదు. దీంతో నరేష్‌ను హైదరాబాద్ నుంచి చెన్నైకు, అక్కడి నుంచి శ్రీలంక తీసుకెళ్లి ఆపరేషన్ ద్వారా కిడ్నీ మార్పిడి చేశారు. ఈ విషయం కొన్నాళ్ల తర్వాత బయటపడగా, దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, విచారణకు తమిళనాడు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమా దంలో దమ్మపేటకు చెందిన కానిస్టేబుల్ గోవిందు మృతి చెందగా మరో కానిస్టేబుల్ ఆంగోతు శ్రీను తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఇదే ఘటనలో సీఐ కొంద్రు శ్రీను కూడా గాయాలయ్యాయి. అప్పట్లో ఈ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. తాజాగా సీఐడీ నమోదు చేసిన చార్జ్‌షీట్‌లో ఏ1గా ముప్పా నరేష్ పేరును చేర్చగా, సిద్దూ అలియాస్ కాస్పరాజు సురేష్, కురప్పన్నం బాలుస్వామి అలియాస్ కుమార్, చెన్నైకు చెందిన గోపీకృష్ణ, శ్రవణ్‌కుమార్, కొలంబోకు చెందిన కార్తీక్, కోకకంటి కిషోర్‌కుమార్‌రెడ్డి, అమ్రిష్ ప్రతాప్, డి.మరిముత్తుతోపాటు ఉరేష్‌బాయ్ అమృత్‌బాయ్ ప్రజాపతి అలియాస్ సురేష్ ప్రజాపతి పేర్లను కూడా పొందుపరిచారు.

24, 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదనపు కోటా కింద 4 వేల టికెట్లను విడుదల చేస్తుంది. అలాగే అక్టోబర్ నెలకు సంబంధించి రోజుకు 15,000 టికెట్లు చొప్పున విడుదల చేయనుంది. కాగా, ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు అక్టోబర్ నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్ లో విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టికెట్ల కోటాను కూడా విడుదల చేస్తుంది. టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.inలో దర్శన టికెట్లు బుక్ చేసుకోచ్చు.

ఎన్‌ఐఏ అదుపులో ఆర్కే భార్య శిరీష

ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఇంట్లో అదుపులోకి

- కొద్దిసేపు టంగుటూరు పోలీసుస్టేషన్‌లో ఉంచిన ఎన్‌ఐఏ
- అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలింపు
- అరెస్టుకు కారణాలు, ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పని ఎన్‌ఐఏ బృందం



టంగుటూరు: మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ అలియాస్ ఆర్కే) సతీమణి శిరీష అలియాస్ పద్మని కేంద్ర దర్యాప్తు సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకుంది. మూడు ప్రైవేటు కార్లలో ఆలకూరపాడుకు చేరుకున్న ఎన్‌ఐఏ బృందం ఇంటి పనుల్లో ఉన్న ఆమెను సాయంత్రం 6 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని, బలవంతంగా కారులో తరలించేందుకు ప్రయత్నించింది. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆమె కుటుంబ సభ్యులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. అనంతరం ఆమెను టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, ఐదు నిమిషాలు అక్కడ ఉంచారు. అనంతరం సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై శ్రీరామ్, ఒంగోలు దిశ ఎస్సై ఫిరోజ్ ఫాతిమాల సమక్షంలో ఆమెను అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎక్కడికి తీసుకెళ్లారన్నది తెలియరాలేదు. ఈ సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఆమెను ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారో కూడా వెల్లడించలేదు.

గతంలోనూ తనిఖీ

ఆర్కే 2021 అక్టోబర్ 16న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మున్నా సైతం ఉద్యమ బాటలో నడిచి ఎదురు కాల్పుల్లో మరణించాడు. ఆ తర్వాత 2022లో ఆలకూరపాడులో శిరీష ఇంట్లో ఎన్‌ఐఏ బృందం ఓసారి తనిఖీలు చేసింది. మావోయిస్టులకు సహకరించడం, నగదు సమకూర్చడం, వైద్య విద్యార్థినితో దళాలకు వైద్యం చేయించి, దళం వైపు ఆకర్షించేలా చేయడంలో శిరీషకు సంబంధం ఉందన్న ఆరోపణలతో 2022 జూలై 19న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎన్‌ఐఏ బృందం ఆమె ఇంట్లో తనిఖీ చేసింది. ఆ సమయంలో శిరీష వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో విరసం నేత కళ్యాణరావును తీసుకొచ్చారు. శిరీష లేకుండా తలుపులు తీయడానికి ఆయన నిరాకరించడంతో తహసీల్దార్, వీఆర్వో సమక్షంలో తాళం పగలగొట్టారు. శిరీష ఇంటి నుంచి సాధారణ షాపుల్లో దొరికే కొన్ని పుస్తకాలు, పలు సీడీలను స్వాధీనం చేసుకున్నారు.

ఇది అక్రమ అరెస్టు: కళ్యాణరావు

శిరీషను ఎన్‌ఐఏ అదుపులోకి తీసుకొన్నట్లు తెలుసుకున్న విప్లవ రచయితల సంఘం నేత గంగుల కళ్యాణరావు హుటాహుటిన స్టేషన్‌కు వచ్చారు. కళ్యాణరావు, ఇతర బంధువులు ఎస్సై శ్రీరామ్‌తో మాట్లాడారు. అనంతరం కళ్యాణరావు మీడియాతో మాట్లాడుతూ.. శిరీషను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎన్‌ఐఏ బృందం తమ కుటుంబానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శిరీషను బలవంతంగా తీసుకెళ్లిందని, ఎక్కడ ఉంచారన్నదీ ఇప్పటివరకు తెలపకపోవడం దారుణమని చెప్పారు. ఎవరినైనా అరెస్టు చేసే ముందు కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. శిరీషను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిరీషపై పెట్టినవన్నీ బూటకపు కేసులేనని అన్నారు.

జిల్లా వార్తలు

రామాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు వితరణ


పునర్నిర్మిస్తున్న ఆలయం వద్ద కమిటీ సభ్యులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో గ్రామస్తులు, దాతల వితరణతో శ్రీకోదండ రామాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ హనుమాండ్ల ఝాన్సీలక్ష్మీ రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆమె తరపున వేమిరెడ్డి మహేంద్రనాథ్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, అర్చకులు వేదాంతం కృష్ణమాచార్యులుతో పాటు వేమిరెడ్డి రామిరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


సమీక్షలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: గిరిజనులకు విద్య, వైద్యం అందించడంతో పాటు ఆవాసాల్లో మౌలిక వసతుల కల్పన కోసం యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. గిరిజనుల నుంచి అందే దరఖాస్తులు, వినతిపత్రాలను పెండింగ్‌లో ఉంచొద్దని స్పష్టం చేశారు. ప్రధానంగా విద్య, వైద్యంపై శ్రద్ధ వహించాలని, పాఠశాలల్లో బోధన సాగేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గిరిజన గ్రామాల్లో మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు గర్భిణులకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ భీమ్, డీఎంహెచ్ఓ శిరీష, వివిధ శాఖల అధికారులు తానాజీ, సురేష్‌బాబు, విజయ్‌కుమార్, రమణయ్య, భాస్కర్, శ్రీనివాస్, అశోక్ కుమార్, రాజ్‌కుమార్, హరికృష్ణ, వైద్యులు చైతన్య, స్పందన పాల్గొన్నారు

ఏటా వరద.. ఐనా అదే వ్యథ!

- భద్రాచలం గోదావరి ముంపు బాధితుల గోస
- వరద వస్తే మూటాముల్లె సర్దుకుని పరుగులు
- ప్రభుత్వ స్కూళ్లే పునరావాస కేంద్రాలు.. అందరికీ సరిపోక అవస్థలు
- శాశ్వత పునరావాస కేంద్రాలపై దృష్టి సారించని పాలకులు


గత ఏడాది సామగ్రి సహా పునరావాస కేంద్రానికి వెళ్తున్న ముంపు ప్రాంత ప్రజలు (ఫైల్)


పునరావాస కేంద్రంలో గోడును వెళ్లబోసుకుంటున్న బాధితులు (ఫైల్)

బూర్గంపాడు: గోదావరికి వరద వస్తుందంటేనే లోతట్టు ప్రాంతాల ప్రజల వెన్నులో వణుకు మొదలవుతుంది. భద్రాచలం డివిజన్‌లోని గోదావరి పరివాహక గ్రామాల ప్రజలకు వర్షాకాలం మొదలవుతుండగానే ఆందోళన చెందడం ఆనవాయితీగా మారింది. జూలై, ఆగస్ట్ నెలల్లో వరదలు సాధారణం కావడం, భద్రాచలం వద్ద గోదావరి వరద 40 అడుగులు దాటితే లోతట్టు ప్రాంతాల ప్రజలకు నిద్ర కరువవుతోంది. వరద పెరుగుతుండగానే మూటాముల్లె సర్దుకుని పిల్లాపాపలు, వృద్ధులతో మెరక ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలు సరిపోక నడిరోడ్లపైనే కాలం వెళ్లదీస్తుండగా... ఏటా ఈ పరిస్థితి ఉంటోందని తెలిసినా శాశ్వత పునరావాస కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధితులను మరింత ఆవేదనకు గురిచేస్తోంది.

వేలాది ఇళ్ల మునక

భద్రాచలం డివిజన్‌లోని బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలకు గోదావరి వరదతో ఏటా ముప్పు ఎదురవుతోంది. గత ఏడాది గరిష్ట స్థాయి వరద రావడంతో ఈ మండలాల్లోని వేలాది ఇళ్లు, వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇళ్లలోకి వరద చేరటంతో బాధితులు సామాగ్రిని వదిలేసి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు వెళ్లారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో తలదాచుకునేందుకు చోటు లేక నడిరోడ్లపై కాలం వెళ్లదీయాల్సి వచ్చింది. రోడ్లపైనే ఉంటూ పెట్టింది తిని కాలం వెళ్లదీశారు. ఇది ఏటా జరుగుతోందని తెలిసినా అధికారులు వరదలు మొదలయ్యాకే పునరావాస కేంద్రాల కోసం వెతుకులాట మొదలుపెట్టడం, మెరక ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలను ఎంచుకోవడం జరుగుతోంది. అయితే, విలువైన సామగ్రితో బాధితులు వస్తుండగా, గదుల్లో చాలా వరకు సామాగ్రితోనే నిండిపోతున్నాయి. ఇక బాధితులు పడుకునేందుకు చోటు లేక ఆటోలు, ట్రాక్టర్లలోనే గడుతారు. వీటికి తోడు పాడిపశువుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారుతుంది. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసినా సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేక పరిసరాలు దుర్గంధభరితమై నెలల పాటు కోలుకోవడం లేదు.

వరద వస్తుందని తెలిసినా..

మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో కాకున్నా ఏటా గోదావరికి వరదలు వస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. ఇందుకోసం జూన్, జూలై నెలల్లో రెండుసార్లు సమీక్షించే అధికారులు.. పునరావాస కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెబుతారు. కానీ వారు ఎంపిక చేసే ప్రభుత్వ పాఠశాలలే కావడంతో అందరికీ సరిపోవడం లేదు. ఈ విషయం ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిసిందే అయినా పట్టించుకోవడం లేదు. ఇక పునరావాస కేంద్రాలు కొనసాగినన్ని రోజులు పాఠశాలలకు సెలవులు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈ సమస్యలు ప్రతీ సంవత్సరం ఎదురవుతున్నా వరద బాధితుల కోసం శాశ్వత పునరావాస కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టడం లేదు. ఐటీసీ, సింగరేణి, నవభారత్ వంటి పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులతో మెరక ప్రాంతాల్లో శాశ్వత భవనాలు నిర్మిస్తే వరదల సమయాన పునరావాస కేంద్రాలుగా, మిగతా సమయంలో ఇతర అవసరాలకు ఉపయోగపడే అవకాశమున్నందున అధికారులు స్పందించాలని ముంపు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

బూర్గంపాడు వాసులకు మరింత కష్టం

గోదావరి వరదల సమయాన మండల కేంద్రం బూర్గంపాడు వాసులకు అష్టకష్టాలు ఎదురవుతున్నాయి. ఓ పక్క గోదావరి, మరోపక్క కిన్నెరసాని వరదతో గ్రామం మొత్తాన్ని నీరు చుట్టేస్తుంది. దీంతో గత ఏడాది కట్టుబట్టలతో బూర్గంపాడు ప్రజలను బయటకు తరలించారు. వీరికి లక్ష్మీపురం, మోరంపల్లిబంజర ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటు చేయగా 300కుటుంబాలకే ఆశ్రయం దొరికింది. మిగతా వారంతా రోడ్లపైనే తలదాచుకున్నారు. అలాగే, నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం వాసులకు ప్రభుత్వ పాఠశాలలో, సారపాకలోని 30వేల మందికి పైగా జనాభాకు భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో పునరావాసం ఏర్పాటు చేసినా అందరికీ చోటు చాలలేదు. దీంతో మిగతా వారు క్రాస్‌రోడ్డు సమీపంలోని అటవీప్రాంతంలో తలదాచుకున్నారు. ఇక మోతె, ఇరవెండి గ్రామాలతో పాటు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ వద్దిరాజు


గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని తల్లాడ-కల్లూరు-పెనుబల్లి-సత్తుపల్లి మార్గాన్ని మరింత విస్తరించి అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు. అలాగే, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు నిధులను మంజూరు చేయాలని ఎంపీ కోరగా మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సంక్షేమ పథకాల ఘనత వైఎస్సార్‌దే..

వైఎస్సార్ టీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కవిత


జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కవిత, నాయకులు

కల్లూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ టీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత పేర్కొన్నారు. కల్లూరులోని ఖాన్‌ఖాన్‌పేటలో మాజీ సర్పంచ్ బి.సుజాత ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్ విగ్రహాలను గౌరవించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. కాగా, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతోనే రాజన్న రాజ్యం మళ్లీ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం కల్లూరులో జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని కవిత, నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. నాయకులు కర్నాటి అప్పిరెడ్డి, జెన్నారెడ్డి నరసింహారెడ్డి, శ్రీరాముల వెంకటేశ్వరరావు, ధరావత్ శివాజీ, గోపి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాగంటి రాజశేఖర్, ఊడల కృష్ణ, రాజశేఖర్, ఆంజనేయులు, సయ్యద్ వజీర్‌మియా, కొత్తపల్లి సుధాకర్, అజ్మీరా గోపీకృష్ణ, చింతపల్లి శ్రీను, యశోద తదితరులు పాల్గొన్నారు.


ఉచిత కరెంట్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు


మాట్లాడుతున్న చైర్మన్ కోటేశ్వరరావు

బోనకల్: ఉచిత విద్యుత్ విషయంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు అన్నారు. బోనకల్‌లోని రైతువేదికలో శుక్రవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు విద్యుత్ ఇస్తూ సీఎం కేసీఆర్ దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అయితే, రైతుల సంక్షేమంపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నలమల వెంకటేశ్వరావు, మధిర మార్కెట్ చైర్మన్ బండం శ్రీనివాసరావుతో పాటు వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్, మంకెన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేగ జ్యూయలర్స్‌లో ఆషాఢం లక్కీ డ్రా


వేగ జ్యూయలర్స్‌లో లక్కీ డ్రా తీస్తున్న మహిళ

ఖమ్మంగాంధీచౌక్: వేగ జ్యూయలర్స్‌లో ఆషాఢ మాసం సందర్భంగా గతనెల 20 నుంచి ఈనెల 20వ తేదీ ప్రత్యేక ఆఫర్లతో ఆభరణాల అమ్మకం చేపట్టారు. అంతేకాకుండా కొనుగోలుదారుల నుంచి డ్రా తీసి విజేతలకు మూడు డైమండ్ నెక్లెస్‌లు అందిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఇందులో భాగంగా శుక్రవారం లక్కీ డ్రా తీయగా విజయవాడకు చెందిన ఉమారాణి, నాగలక్ష్మి, హైదరాబాద్‌కు చెందిన ఉమా మహేశ్వరి విజేతలుగా నిలిచాఉ. వీరికి జ్యూయలరీ యాజమాన్యం వనమా నవీన్, వనమా సుధాకర్ డైమండ్ నెక్లెస్‌లను అందజేసి మాట్లాడారు. ఆషాఢ మాసం ఆఫర్లతో విక్రయాలకు మంచి స్పందన లభించిందని తెలిపారు. ఖాతాదారులకు సంప్రదాయం మొదలు ఆధునిక డిజైన్ల వరకు స్వచ్ఛమైన ఆభరణాలను అందించాలనేది తమ లక్ష్యమని వివరించారు. త్వరలోనే అమెరికాలో సైతం వేగ జ్యూయలర్స్ షోరూంలు ప్రారంభిస్తున్నామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేకూరి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను వరంగల్‌లోని కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. 2010లో ఇదే యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన ఆయన రాసిన పలు వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయస్థాయి జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా రవికుమార్‌కు కళాశాల అధ్యాపకులు,ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.